

కథా కౌముది

# గుర్తుకొస్తున్నాయి

డా.కొండపల్లి రామారావు

"ఇదిగో, పట్టాభి నుంచి ఫోన్" వంటింట్లో పని చేసుకుంటున్న జానకమ్మ గారికి ఫోనందించారు అయోధ్య రామారావు గారు.

"మీరు మాట్లాడకపోయారా?" ఫోనందుకుంటూ అన్నారావిడ.

"నీ ఫోనుకు చేశాడు కదా, నీవే మాట్లాడితే బాగుంటుంది" అంటూ న్యూస్ పేపర్ పట్టుకొని వీధి వరండాలోకి వెళ్ళిపోయారాయన.

"హలో పట్టాభీ, చెప్పరా!" చీర కొంగుతో చేతులు తుడుచుకుంటూ అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నారావిడ.

"ఏమిటే అమ్మా! నీ ముద్దుల కొడుకు ఏదో చెప్పటం, నాన్నగారు దానికి తలూపటం! ఆయనగారేదో ప్లాటో, ఫ్లాటో కొనాలట! తన వాటా తనకు పంచి యిమ్మంటున్నాడట! దానికి నాన్నగారు కూడా సరేనన్నారట! ఏమిటిది? ఏం జరుగుతున్నది అక్కడ?" విసురుగా అన్నాడు వారి పెద్దకొడుకు పట్టాభి రామ్.

"వాడు చెప్పిన మాట నిజమే కానీ దానికి నాన్నగారు ఒప్పుకున్నట్లు నాకు తెలియదురా! అయినా నీవే నాన్న గారితో..."

"నేను ఎవరితో ఏమీ మాట్లాడేది లేదు" ఆమె మాటను పూర్తి కానివ్వలేదు అతను.

"నేను పెద్దవాడనయ్యేసరికి వర్షాలు లేక, పంటలు పండక, రకరకాల ఇబ్బందులతో పై చదువులు చదవడానికి నాకు వీలు కాలేదు. చదివిన చదువుతో ఏదో ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకుని ఇంటికి దూరంగా రావలసి వచ్చింది. వాడు పెద్దవాడు అయ్యేసరికి నీటివనరులు పెరిగిపోయి, పంటలు పండి, డబ్బు ఇబ్బందులు తగ్గి, వాడు పెద్ద చదువులు చదవటానికీ, మంచి ఉద్యోగం సంపాదించుకోవటానికీ వీలయింది. ఏదో నా జీతానికి తోడు, కొద్దో గొప్పో పొలం మీద వచ్చే ఆదాయాన్ని కలుపుకొని నా బతుకు నేను బ్రతుకుతున్నాను. ఆడపిల్లల పెళ్ళిళ్ళకు కొంత పొలం

యిదివరకే పోయింది. ఇప్పుడు వాడు కూడా పొలమమ్ముతానంటే ఎట్లా? ఇప్పుడు వాడి వాటా వాడికి ఇస్తే ఎంతో ఒకంతకు తెగనమ్ముతాడు. పొలం యింకా తగ్గిపోతుంది. వచ్చే పంట తగ్గుతుంది. పొలం రేటు పడిపోతుంది. ఎవరికి నష్టం? నాకే కదా! మరీ అంత స్వార్థమా!" గట్టిగా అరుస్తున్నట్టు అన్నాడు పట్టాభి రామ్.

"అంటే, వాడు ఉంటున్న ఇల్లు ఆఫీసుకు చాలా దూరం అట. దగ్గరలో ఒక ఫ్లాట్ కొని ఎడ్వాన్స్ కొద్దిగా ఎక్కువ ఇస్తే మిగిలింది వాడి జీతంలో నెలనెలా తేలిగ్గా కట్టవచ్చని..." సమాధాన ధోరణిలో జవాబు ఇవ్వబోయారు జానకమ్మగారు.

"మొగుడూ పెళ్ళాలు ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లే కదా!" ఆమె మాటకు మళ్ళీ అడ్డు వచ్చాడు అతను. "అంత మాత్రం కట్టుకోలేరా? ఇప్పుడు పొలం అమ్మి కడితేగానీ కుదరదా?మరి అందరిలో పెద్దవాడిని కదా, నాకు జరిగిన నష్టానికి జ్యేష్టభాగం కింద ఎక్కువ పొలం యిమ్మంటే ఇస్తారా? ఇవ్వరు కదా! ఏది ఏమైనా వాడన్నదానికి నాన్నగారు ఒప్పుకుంటే మాత్రం ఊరుకునేది లేదు. తమ్ముడని కూడా చూడను. నాన్నగారికి ఈ విషయం చెప్పు" అనేసి, ఫోన్ పెట్టేశాడు పట్టాభి రామ్.

"హు!" మెల్లగా నిట్టూర్చారు జానకమ్మ గారు.

"ఏమంటాడు జేష్టుడు?" నవ్వుతూ అడిగారు అయోధ్య రామారావు గారు భార్యను.

"మీకు తెలియనిదేముంది? ఆస్తి పంపకాల విషయంలో..." జానకమ్మ గారి మాట పూర్తికాకుండానే ఆమె ఫోన్ మళ్ళీ మోగింది.

'పావన్', తనలో తనే అనుకుంటూ ఫోన్ చేతిలోకి తీసుకున్నారావిడ.

"అమ్మా! ఏమిటి, నేను చెప్పిన దానికి నాన్నగారేమీ బదులివ్వలేదు?! అసలు నా పరిస్థితి మీకుగానీ, మీ పెద్దబ్బాయికి గానీ అర్థమవుతున్నదా? పేరుకు పెద్ద జీతాలే గానీ ఇక్కడ మేము ఎంత కష్టపడుతున్నామో మీకు తెలుసా? ఆఫీసుకి వెళ్ళిరావటానికే సగం ఎనర్జీ ఖర్చవుతున్నది. జాగ్రత్తగా ఆలోచించి నేనేదో పరిష్కారమార్గం చెప్తే, దానికింత తాత్సారమేంటి? ఆడపిల్లలకు ముట్టవలసినది వాళ్ళకు యిదివరకే ముట్టింది కదా! ఇక మేమేగా మిగిలింది. ఇప్పుడు నా వాటా నాకు ఇవ్వడానికి ఇంత రాద్ధాంతం ఏంటి? ఈ దీపావళి లోపు నేను అడిగింది చేయకపోతే ఏం చేస్తానో నాకే తెలియదు. నాన్నగారికి చెప్పు" తను చెప్పదలచుకున్నది చెప్పేసి టక్కున ఫోన్ పెట్టేసాడు వారి రెండవ కొడుకు పావన్ రామ్.

"ఏమిటో ఈ పిల్లలు!" అనుకుంటూ నీరసంగా కుర్చీలో వెనక్కు వాలారావిడ.

"వీడూ ఆ విషయమేగా?" ప్రశ్నార్థకంగా భార్య వైపు చూస్తున్న ఆయన, జేబులో ఫోన్ మోగగానే ఉలిక్కిపడ్డారు. 'సుపుత్రులు అయినారు, ఇక సుపుత్రికలేమో!' అనుకుంటూ ఫోన్ తీశారాయన.

"నాన్నగారూ! నేను మైథిలిని. ఏమిటి, అమ్మ ఏమి నిర్ణయించిందో చెప్పిందా? ఆ బంగారం ఉండేది ఎప్పుడూ లాకర్ల లోనే కదా! అమ్మ పెట్టుకోవటమేలేదు. ఈ విషయంలో మీ కొడుకులు కూడా ఏదో సలహా ఇచ్చి ఉంటారు, అందుకే అమ్మ భయపడుతున్నట్లుంది, ఒక నిర్ణయం తీసుకోవటానికి. మాకు ఆస్తులు ఇవ్వటానికి వాళ్ళు ఎట్లాగూ ఒప్పుకోరు కదా! ఆ బంగారం సంగతైనా తేల్చి, మాకు ఇచ్చేదేదో చెప్తే మా ప్లాన్లు మేము వేసుకుంటాం కదా! అమ్మ ఏమీ మాట్లాడదేమిటి? ఒకవేళ మీ చిన్నమ్మాయికి 'ఇద్దరూ ఆడపిల్లలే కదా, అంతా దానికే దోచిపెడతామ'ని అనుకుంటున్నారేమో! అట్లా చేస్తే మటుకు ఊరుకునేది లేదు! నాకు ఇద్దరూ కొడుకులే గానీ వాళ్లకు పెళ్లిళ్ళు కాగానే మా ఇంటికి కూడా యిద్దరు ఆడపిల్లలు వస్తారు కదా! వాళ్లకీ మేమేమైనా ఇవ్వాలి కదా!" పెద్ద గొంతుతో తనకు కావలసిందేమిటో చెప్పింది వారి పెద్దకూతురు మైథిలి.

"అది కాదమ్మా, ఆ సంగతి తరువాత ఆలోచించ వచ్చు కదా! ఎవరికి ఏమిటి అనేది ఇప్పుడు ఎందుకు?" సర్ది చెప్పబోయారాయన.

"మీ కొడుకులు ఇద్దరూ మీరు ఉన్నప్పుడే వాటాలు పంచుకుంటామంటున్నారు కదా! పనిలోపని – ఇదీ కానిస్తే సరిపోతుంది. అమ్మకు చెప్పండి, పక్షపాతం లేకుండా ఆలోచించి, తొందరలో నిర్ణయం తీసుకోమని" గబుక్కున ఫోన్ పెట్టేసింది మైథిలి.

"ఇంకా ఒక ఫోను బాకీ ఉంది" చిన్నగా నవ్వుతూ అన్నారు అయోధ్య రామారావు గారు.

ఆయన ఎంతో సేపు ఎదురుచూడకుండానే ఆ ఫోనూ వచ్చింది.

"నాన్నగారూ! నేను జాహ్నవిని. ఏమిటి మీ పెద్ద కూతురు కోరినట్లుగానే చేస్తున్నదా అమ్మ? నా సంగతి ఏమైనా ఆలోచించారా లేదా? నా మొగుడిది చిన్న ఉద్యోగం. ఇద్దరూ ఆడపిల్లలు. అందరిలోకీ చిన్నదాన్ని. పెద్దవాళ్ళు పెరిగినంత గారాబంగా నేను పెరగలేదు. ఆ మాత్రం జ్ఞానం కూడా లేదేమిటి దానికి? అసలు..."

"ఆగమ్మా, ఆగు!" అక్కను ఇంకా ఎంత మాట అనేస్తుందోనని భయపడుతూ మధ్యలోనే ఆమెను ఆపారు ఆయన. "అమ్మ అన్నీ ఆలోచిస్తుంది లేమ్మా! ఎందుకు తొందర పడతారు మీరు?" అంటుంటేనే అట్నుంచి జాహ్నవి ముక్కు ఎగపీల్చటం తెలిసింది.

"ఇటు కన్నవాళ్ళకు నా మీద ప్రేమా లేదు, అటు తోడబుట్టిన వాళ్ళకు నా గురించి ఆలోచనా లేదు. ఎవరి స్వార్ధం వాళ్ళది. చిన్న దానిగా పుట్టినందుకు నాకు ఎప్పుడూ అన్యాయమే! అంతా నా కర్మ" అంటూ ఫోన్ పెట్టేసింది వారి రెండవ కూతురు జాహ్నవి.

"ఏమిటండీ, ఏం చేద్దాం? ఈ పిల్లలు ఇట్లా తయారయ్యారేం? చిన్నప్పుడు ఎట్లా ఉండేవారు! ఆ ప్రేమలు, ఆప్యాయతలు – అన్నీ ఎక్కడికి పోయాయి? అన్నీ మర్చిపోయారా?" అంటూ ఆయనకు దగ్గరగా వచ్చారు జానకమ్మ గారు.

"బాధపడకు, నేనున్నానుగా!" సాలోచనగా ఆమె అన్న మాటలు మననం చేసుకుంటూ, ఆమె చేతి మీద చేయి వేసి అభయమిస్తూ కళ్ళు మూసుకొని ఈజీ చెయిర్లో వెనక్కు వాలారాయన.

ఒక్కసారిగా కళ్ళు తెరిచిన అయోధ్య రామారావుగారికి తళుక్కున ఒక ఆలోచన వచ్చింది. 'అవును, అదే మందు!', అని మనసులో అనుకుంటున్న ఆయన పెదవుల మీద ఒక చిరునవ్వు మెరిసింది. వెంటనే ఇద్దరు కొడుకులకు, ఇద్దరు కూతుళ్లకు ఫోన్ మెసేజెస్ వెళ్ళిపోయాయి.

'ఈ సారి దీపావళి మేమిద్దరం మీతో గడపాలని అనుకుంటున్నాము. ఈ ఒక్కసారికి మీ వాళ్లనందరినీ వదిలేసి మీరు ఒక్కరే మన ఊరు రండి. ఒక నాలుగు రోజులు ఉండి వెళుదురు గాని! ఎవరినీ మీతో తీసుకు రావద్దు. తప్పకుండా వస్తారని ఆశిస్తున్నాము' అని.

ఇష్టాయిష్టాలు ఎట్లా ఉన్నా అందరికీ ఇంట్రెస్ట్ ఉన్న విషయం కాబట్టి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు అందరూ పండగకు ఓ రెండు రోజులు ముందు సాయంత్రానికల్లా వాళ్ల ఊరు చేరుకున్నారు.

వస్తూనే ఒక్కొక్కళ్ళు ఒక్కో రూమును ఆక్రమించుకుని, ఒకళ్ళతో ఇంకొకళ్ళు ఎంత తక్కువగా వీలైతే అంత తక్కువగా ఎదురుపడే ఏర్పాటు చేసుకున్నారు నలుగురూ.

వాళ్లను చూసి తనలో తనే నవ్వుకున్నారు అయోధ్య రామారావు గారు.

"మన తోట పెరడు వరకు వెళ్లొద్దామా?" మర్నాడు ఉదయం లేవగానే ఇద్దరు కొడుకులనూ బయలుదేరదీశారు ఆయన. ఇద్దరినీ చెరొక పక్క ఉంచుకొని నడుస్తున్న ఆయన్ను చూసిన ఊరి వాళ్ళు రకరకాలుగా పలకరించ సాగారు.

"అబ్బాయి గార్లు ఇద్దరూ ఒకసారే వచ్చారే!"

"రామలక్ష్మణులు లాగా ఉన్నారు!"

"మీరు చాలా అదృష్టవంతులండి! మీ పిల్లలు ప్రయోజకులు, బుద్ధిమంతులు. ఇక మీకు నిశ్చింత" – తలా ఒక విధంగా అంటుంటే పట్టాభి రామ్, పావన్ రామ్ కొద్దిగా ఇబ్బంది పడుతూ మౌనంగా నడవసాగారు. అయోధ్య రామారావు గారు మాత్రం అందరికీ చిరునవ్వే సమాధానంగా ఇస్తూ ముందుకు సాగారు.

అందరి పలకరింపులతో అర కిలోమీటరు కూడా లేని తోట పెరడు వరకు నడవడానికి వాళ్లకు అరగంట పట్టింది. అది దగ్గర పడుతుండే సరికి అన్నదమ్ముల ముఖాలలో చిరాకు, కోపం స్థానే ప్రసన్నత చోటు చేసుకుంది.

లోపలికి వెళుతూనే "ఇక్కడే కదా మనం మొక్కజొన్న వేసే వాళ్ళం" హఠాత్తుగా అన్నాడు పట్టాభిరామ్.

"అవును. ఇటు పక్క కూరగాయలు వేసే వాళ్ళం" అప్రయత్నంగా జవాబిచ్చాడు పావన్ రామ్.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు అన్నదమ్ములు ఇద్దరూ.

మోట బావి దగ్గరకు వెళ్లగానే పావన్ రామ్ నుదుటి మీద చిరు చెమటలు పట్టాయి. గబుక్కున పట్టాభి వైపు చూశాడు. అప్పుడే తమ్ముడిని గమనించిన పట్టాభి అప్రయత్నంగానే అతని చేయి మీద తన చేయి వేశాడు. అన్నదమ్ములు ఇద్దరికీ చిన్నప్పటి ఒక సంఘటన గుర్తుకు వచ్చింది.

పావన్ రామ్ కు ఆరేళ్ళ వయసులో ఒకసారి మోట బావి దగ్గరికి వెళ్లి నప్పుడు, లోపలికి తొంగి చూస్తూ బ్యాలెన్స్ ఆపుకోలేక బావిలో పడిపోయాడు. అతను ఈత రాక చేతులు, కాళ్ళు కొట్టుకుంటుంటే పక్కనే ఉన్న పన్నెండేళ్ళ పట్టాభి రామ్ వెంటనే ధైర్యంగా బావి లోకి దూకి, తనకు తెలిసిన కొద్ది ఈత అనుభవంతో పావన్ రామ్ ను బావి లోపలి మెట్లమీద కు లాగేశాడు.

'ఆరోజు అన్నయ్య తనను కాపాడక పోతే ఏమై ఉండేది!', అనుకోగానే పావన్ రామ్ ముఖంలో భయం ప్రస్ఫుటంగా కనబడింది. తమ్ముడి పరిస్థితిని గ్రహించిన పట్టాభి రామ్ అతని చేతిమీద చిన్నగా తట్టాడు ధైర్యం చెబుతున్నట్లుగా.

"ఏమైంది?" అడిగారు అయోధ్య రామారావు గారు, వాళ్ళిద్దరి వైపు చూస్తూ.

"ఏం లేదు" ఇద్దరూ ఒక్కసారిగా జవాబిచ్చారు. ఆ ఉదంతం తండ్రికి చెప్పకుండా దాచామని వాళ్ళు అనుకున్నారు గాని ఆయనకు ఆ విషయం వేరే వాళ్ల ద్వారా తెలిసినట్లు వాళ్లకు తెలియదు. విషయం గ్రహించారాయన.

అంత దూరంలో ఉన్న చింతచెట్టును చూడగానే పట్టాభి రామ్ మనసులో ఇంకో చిన్ననాటి సంఘటన మెదిలింది.

ఒకసారి, "ఈరోజు నేను సిగరెట్ తాగుతాను, చూద్దువు గాని రా!" అని తమ్ముడిని కూడా తీసుకొని వెళ్ళి చింతచెట్టు కింద కూర్చుని రహస్యంగా సిగరెట్ తాగుతున్నాడు పట్టాభి రామ్.

అయితే అయోధ్య రామారావు గారికి ఇటువంటివి గిట్టవు. ఆయన అటువైపు రావటం చూడగానే పావన్ రామ్ చేతిలో సిగరెట్ ఉంచేసి తను చింత చెట్టు ఎక్కి కూర్చున్నాడు పట్టాభి రామ్. పావన్ రామ్ చేతిలో సిగరెట్ చూసిన ఆయనకు పిచ్చి కోపం వచ్చి ఇంటికి లాక్కెళ్లి నాలుగు వాయించారు. అయితే అన్న పేరు గానీ అతను చెట్టు మీద దాక్కొని ఉన్న సంగతి గానీ ఏమాత్రం చెప్పకుండా ఆ దెబ్బలు అన్నీ భరించాడు పావన్ రామ్.

తరువాత పట్టాభి రామ్ "అయ్యో, నా వల్ల నీవు దెబ్బలు తిన్నావు రా!" అని బాధపడుతుంటే పావన్ రామ్, "నీవైతే పెద్దవాడివి కాబట్టి నాన్నగారు ఇంకా ఎక్కువ కొట్టేవారు. నన్ను తక్కువే కొట్టారులే!" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

తమ్ముడు తనపై చూపిన ప్రేమకు కదిలిపోయాడు పట్టాభి రామ్.

ఆ సంఘటన గుర్తుకు వచ్చిన పట్టాభి రామ్ తమ్ముడి వైపు చూసే సరికి అప్పుడే ఆ సంఘటన గుర్తుకు వచ్చిన అతను కూడా పట్టాభి వైపు నవ్వుతూ చూస్తూ కనపడ్డాడు. ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

"ఒకసారి నీవు అప్పుడే చెట్టు నుంచి కోసిన పచ్చి మిరపకాయ తిని 'నోరంతా మండి పోతున్నది' అని గొడవ పెట్టావు కదా!" పట్టాభిరామ్ అన్నాడు.

"అప్పుడు నీవు ఒక ఉల్లికాడ కోసి మంట తగ్గుతుంది కొరకమన్నావు కదా! నాకేమో మిరపకాయ మంటకు ఉల్లిఘాటు తోడు అయింది." నవ్వుతూ అన్నాడు పావన్ రామ్. "నాకు మాత్రం ఏం తెలుసు అప్పుడు? నీవు 'మంట మంట' అని ఏడుస్తూ ఉంటే ఏదో ఓకటి చెయ్యాలని, నాకు తోచింది చెప్పాను" తనూ నవ్వాడు పట్టాభి రామ్. చిన్ననాటి అల్లరిపనులు గుర్తుకువచ్చి ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

"తోటలో మొక్కజొన్న గానీ, మిరప గానీ, పొగాకు గానీ వేసినప్పుడు కూరగాయలు ఇక్కడ వేసే వాళ్ళం. కానీ ఎండాకాలంలో నీవు ఇంట్లో మళ్ళు చేసి కూరగాయల విత్తనాలు చల్లే వాడివి కదా!" అన్న వైపు చూస్తూ అన్నాడు పావన్ రామ్.

"అవును. అప్పుడు నేను బావిలో నుంచి నీళ్లు చేదుతుంటే నీవు రెండు బకెట్లు చెరో చేత్తో పట్టుకుని తీసుకెళ్లి మళ్ళకు నీళ్ళు పోసే వాడివి, గుర్తుందా?" పట్టాభి రామ్ అన్నాడు, ఆ రోజులు గుర్తు చేసుకుంటూ.

"అమ్మకు కొత్తిమీర కావాలంటే నీవే పైపైన రెమ్మలు కోసి యిచ్చే వాడివి"ఊ గుర్తు చేసుకున్నాడు పావన్ రామ్.

"మరి అమ్మేమో మొదలంటా పీకేది, నాకు నచ్చేది కాదు" నవ్వాడు పట్టాభి రామ్. "అప్పుడు, చిక్కుడుకాయలు - కాస్తే - తెగ కాసేవి కదా!" అన్నదమ్ములిద్దరూ మరుగునపడిన ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ మాటల్లో పడిపోయారు.

వాళ్లను అక్కడే వదిలి కొంతదూరం వెళ్ళి వాళ్ళని గమనిస్తున్న అయోధ్య రామారావు గారి ముఖం మీద ఒక చిరునవ్వు మెరిసింది. తోట పెరడు నుంచి తిరిగి వచ్చేటప్పుడు ఆయనకు చెరొక పక్కగా కాకుండా వెనుకగా ఒకరి పక్కన ఒకరు ఏవో మాట్లాడుకుంటూ నడుస్తూ వస్తున్న అన్నదమ్ములను చూసి ఆశ్చర్యపోయారు జానకమ్మ గారు. మధ్యాహ్నం భోజనాల దగ్గర అన్నదమ్ములిద్దరూ ఏవో మాట్లాడుకుంటూ ఉన్నా అక్కచెల్లెళ్ళు ఇద్దరూ ముభావంగానే ఉన్నారు. వాళ్ళను ఓసారి చూసి భర్తకు కనుసైగ చేశారు జానకమ్మ గారు. తల పంకించి ఊరుకున్నారాయన.

ఆ రోజు సాయంత్రం కాగానే కూతుళ్లిద్దర్నీ బయటకు బయలుదేరదీశారు అయోధ్య రామారావు గారు, "మీరు చిన్నప్పుడు చదివిన స్కూల్ ఒకసారి చూడరా?" అంటూ. ముభావంగానే బయలుదేరారు అక్క చెల్లెళ్ళిద్దరూ.

కూతుళ్లు ఇద్దరూ చెరో పక్క నడుస్తుండగా ముందుకు సాగారాయన, "ఈసారి అమ్మాయి గార్లు ఇద్దరూ ఒక్కసారే వచ్చారే!" "లక్ష్మీ పార్వతుల్లాగా ఉన్నారు" అని కనబడ్డ వాళ్ళందరూ పొగుడుతూ అనే మాటలు వింటూ.

స్కూల్ అంత దూరంలో ఉండగానే ఆంజనేయస్వామి గుడి దగ్గరకు చేరుకోగానే మైథిలి ముఖం ఒక్కసారే గంభీరంగా మారిపోయింది. ముఖమంతా భయం, ఆందోళనలతో నిండిపోయింది. అదే సమయంలో అక్క వైపు చూసిన జాహ్నవి వెంటనే అక్క చేయి పట్టుకుంది. మైథిలి కూడా జాహ్నవి చేతిని గట్టిగా పట్టుకుంది, చెమటతో తడిసిన తన చేత్తో.

ఒకసారి స్కూల్ కి వెళ్తుంటే జరిగిన సంఘటన ఇద్దరికీ ఒక్కసారే గుర్తుకు వచ్చింది.

అప్పుడు మైథిలికి పద్నాలుగేళ్ళు, జాహ్నవికి పదేళ్ళు. ఒకరు తొమ్మిదవ తరగతి ఇంకొకరు ఐదవ తరగతి చదువుతున్నారు.

ఆరోజు స్కూలుకు వెళుతుండగా ఓ పదవ తరగతి కుర్రాడు వాళ్ళను అడ్డగించాడు, చేతిలో ఒక సీసాతో.

"నా చేతిలో యాసిడ్ ఉంది, మైథిలీ! నీవు నన్ను ప్రేమించక పోతే ఈ యాసిడ్ నీ ముఖం మీద పోస్తాను" అంటూ ఒక చేత్తో మైథిలి చేయి పట్టుకొని సీసా మూత తెరిచాడు.

అసలే బక్క పలుచగా ఉన్న మైథిలి అతను చేసిన పనికి ఒక్కసారిగా భయంతో కొయ్యబారి పోయింది.

జాహ్నవి మైథిలి కంటే చిన్నదే అయినా చిన్నప్పట్నుంచి అన్నిరకాల ఆటల్లో ముందుండటం వల్ల మైథిలి కంటే బొద్దుగా, బలంగా ఉండేది.

అతను తనను గమనించడం లేదన్న విషయం గుర్తించిన జాహ్నవికి 'ఏమి చేయాలా' అని అటూ ఇటూ చూసే సరికి రోడ్డు పక్కన పడేసి ఉన్న ఒక మూడడుగుల ఇనుపచువ్వ కనబడింది. క్షణం కూడా ఆలోచించకుండా ఆ అమ్మాయి ఒక్క దూకులో దాన్ని అందుకొని మైథిలి చేయి పట్టుకున్న అబ్బాయి చేతి మీద గట్టిగా కొట్టింది.

ఊహించని ఈ పరిణామానికి "అబ్బా!" అంటూ చేయి లాక్కున్న అతనికి బ్యాలెన్స్ తప్పి రెండో చేతిలోని యాసిడ్ అతని ముఖం మీద, వంటి మీద పడిపోయింది. అటు ఇనుప చువ్వ తో తగిలిన దెబ్బ నొప్పి, ఇటు ముఖం మీద, ఒంటి మీద పడ్డ యాసిడ్ మంటతో అతను అక్కడి నుంచి వెంటనే పారిపోయాడు. భయంతో బిగుసుకుపోయిన అక్క భుజం చుట్టూ చెయ్యి వేసి నెమ్మదిగా ఇంటికి తీసుకు వచ్చింది జాహ్నవి.

అయోధ్య రామారావు గారికి ఈ విషయం తెలిసే సరికే, గ్రామ కరణంగా ఆయనకు ఆ ఊళ్ళో ఉన్న పరపతి తెలిసిన ఆ అబ్బాయి తల్లిదండ్రులు, వాళ్ళ అబ్బాయిని తీసుకొని ఊరు వదిలి పారిపోయారు. ఆ రోజు నుంచి జాహ్నవి పేరు ఝాన్సీ లక్ష్మి గా మారిపోయింది ఊళ్ళో.

"అప్పుడు ఎంత ప్రమాదం తప్పింది!" స్వగతం లో అనుకుంటూ జాహ్నవి చేయి నొక్కింది మైథిలి.

"తప్పింది గా!" చిరునవ్వుతో అంది జాహ్నవి. అప్పటివరకు ముభావంగా ఉన్న ఇద్దరి ముఖాలలో ప్రసన్నత చోటుచేసుకున్నది.

"మనం బతుకమ్మ ఆటలు ఆడినప్పుడు చివరి రోజు నిమజ్జనం చేసే నల్లచెరువు యిటే కదూ!" మైథిలి అడిగింది జాహ్నవిని.

"అవును, చూసొద్దామా?" ఉత్సాహంగా అంది జాహ్నవి.

ఏమీ బదులు ఇవ్వకుండా అటు వైపు అడుగులు వేశారు అయోధ్య రామారావు గారు.

చెరువు దగ్గరికి చేరుకోగానే పాత జ్ఞాపకాలు గుర్తు కొచ్చాయి అక్కచెల్లెళ్ళిద్దరికీ. 'మంచి నీళ్ల బావి వద్ద చందమామ...', 'ఒక్కొక్క పువ్వేసి...', 'గొల్లభామలమ్మా...', 'ఘల్లుఘల్లు న లేడి...', 'ఒక్కొక్క వేపగింజ..' పాటలు చెవుల్లో గింగురు మన్నాయి.

"ఏమిటో, ఆ పాటలన్నీ మరిచిపోయాము. ఇప్పుడిక విందామన్నా దొరకవు" నిట్టూర్చింది మైథిలి.

"ఏం ఫర్వాలేదు. మీరు చిన్నప్పుడు ఆ పాటలు పాడుతుంటే నేను మీ అన్నయ్యకి చెప్పి టేపు రికార్డర్ లో రికార్డు చేయించాను. ఈ మధ్యనే ఆ టేపు నాకు దొరికింది" నవ్వుతూ అన్నారు అయోధ్య రామారావు గారు. అక్క చెల్లెళ్ళిద్దరి ముఖాలు వెలిగిపోయాయి, ఆయన మాటలు వినగానే.

"ఇంటికి పదండి నాన్నా, వెంటనే వెళ్లి ఆ టేపు వినాలని ఉంది" అన్నారిద్దరూ.

"వెళ్దాంలే! అవునూ, అప్పుడు బతుకమ్మను నీళ్లల్లో వదులుతూ కాలు జారి చెరువులో పడబోయిందెవరే?" ప్రశ్నించారు ఆయన.

"ఇదిగో, యిదే! పెద్ద ఝాన్సీలక్ష్మి కదా! వద్దన్నా వినకుండా మా కంటే ముందు వెళ్ళింది" చెల్లెలి భుజం మీద చరిచింది మైథిలి.

"అప్పుడు నీవేగా గట్టిగా చేయి పట్టుకొని నన్ను బయటకు లాగింది" అంటుంటే కళ్ళు చెమర్చాయి జాహ్నవికి.

చెల్లెలి చేతి మీద తన చేయి వేసి మెల్లగా నొక్కింది మైథిలి.

ఆ రాత్రి అక్క చెల్లెళ్ళిద్దరూ ఒక గదిలో అన్నదమ్ములిద్దరూ మరో గదిలో కొద్దిసేపు కబుర్లు చెప్పుకున్న తరువాత అందరి పక్కలూ హాల్లోకి మారాయి.

చిన్నప్పుడు సంక్రాంతికి ముందు, ఆడపిల్లలు బంతిపూల చెట్లు వేయటం, మగపిల్లలు వాటికి నీళ్ళు పోసి పెంచటం; ఆడపిల్లలు సంక్రాంతి ముగ్గులు వేయటానికి తెల్లవారుజామునే లేస్తే వాళ్ళకు తోడుగా మగపిల్లలు కూడా లేచి చలికి వణుకుతూ ఓ పక్క కూర్చోవటం; ఆడపిల్లలు బతుకమ్మలు పేరుస్తూ ఉంటే మగ పిల్లలు కూడా వాళ్లకు సహాయం చేయటం; వినాయకచవితికి అందరూ కలిసి తెల్లవారుఝామున లేచి అక్కడా ఇక్కడా పూలు, పత్రి తీసుకురావడం – అన్నీ నెమరువేసుకున్నారు.

ఆడపిల్లల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని పనివాళ్ళు 'కోడి పిల్లలు కొని పెంచితే చాలా లాభం' అని చెప్పి ఆడపిల్లలు దాచుకున్న చిల్లర డబ్బులు తీసుకుని తాగుడుకి ఖర్చు పెట్టడం – తరువాత 'కోడి పిల్లలు కొన్నామనీ, పెద్దవవుతున్నవనీ, గుడ్లు పెట్టాయనీ, అవి పిల్లలయ్యాయనీ, చివరికి చనిపోయాయ'నీ నాటకాలు ఆడటం – వీళ్ళు ఏమీ అనలేక బిక్క ముఖాలు వేయటం, మగపిల్లలు వీళ్ళను మొదలుఆటపట్టించినా తరువాత పనివాళ్ళను బెదిరించి కొంత డబ్బైనా వీళ్ళకు తిరిగి యిప్పించటం – అన్నీ గుర్తుచేసుకుని నవ్వుకున్నారు నలుగురూ.

ఒకరి పక్కన ఒకరు కూర్చుని పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకుని నలుగురూ నేల మీద డోలా పక్కలు వేసుకుని పడుకున్నారు.

మర్నాడు ఉదయం అయోధ్య రామారావు గారు లేచి తయారయ్యే సరికి అన్నదమ్ములిద్దరూ 'పొలం దగ్గరికి వెళ్లి వస్తాము' అని చెప్పి వెళ్ళిపోయారు. అక్క చెల్లెళ్ళు ఇద్దరూ చెరి ఒక నామం గడ్డ తీసుకొని గదుల్లో నేలమీద నాపరాయి మీద ముగ్గులు వేస్తున్నారు.

"నాన్నగారూ! సాయంత్రానికల్లా ఒక మూడు నాలుగు రకాల పెయింట్ డబ్బాలు చిన్నవి తెప్పిస్తే ఈ రాత్రికి అన్నదమ్ములిద్దరూ ఈ ముగ్గుల మీద దిద్దుతామన్నారు" అన్నది మైథిలి.

"తప్పకుండా!" నవ్వుతూ అంటున్న భర్త వైపు సంతోషంగా చూశారు జానకమ్మ గారు.

ఆ రోజు సాయంత్రం నలుగురు పిల్లల్నీ పిలిచి, "ఇవిగో మీ మీ వాటాలు!" అంటూ నాలుగు ప్యాకెట్లు అందించారు అయోధ్య రామారావు గారు.

తెరచి చూస్తే అందులో ఉన్నది దీపావళి మందుగుండు సామాను. చిన్నప్పటి లాగానే అందరికీ సమానంగా పంచి ఇచ్చారు ఆయన. ఫక్కున నవ్వారు నలుగురూ.

"వాడు బాంబులు కాల్చ లేడు" అంటూ పావన్ రామ్ ప్యాకెట్ లో నుంచి గబగబా బాంబులు తీసుకుని ఒక కాకరపువ్వొత్తుల పెట్టె అతని ప్యాకెట్ లో పడేశాడు పట్టాభిరాం నవ్వుతూ.

"ఈ విష్ణుచక్రాలు చేతి మీదికి వస్తాయి, నాకు నచ్చవు బాబూ" అంటూ భయాన్ని నటిస్తూ, తన విష్ణు చక్రాలు జాహ్నవి ప్యాకెట్ లో పడేసి ఆమె ప్యాకెట్ లోని భూచక్రాలు తను తీసుకుంది మైథిలి.

"ఇంకా ఇప్పుడు కూడా చిన్నతనంలో లాగేనా భయాలు!" చిన్న పిల్లల్లాగా ఆటలు ఆడుతున్న వాళ్ళను చూస్తూ సంతోషంగా అన్నారు జానకమ్మ గారు.

ఆ మర్నాడు పండగ అంతా సరదాగా గడిచిపోయింది. సరిగ్గా చిన్నతనంలో లాగానే – తెల్లవారుఝామునే ముందుగా లేచినవారు టపాకాయలు కాలుస్తూ ఇంకా నిద్ర లేవని వాళ్ళను లేపటం, ఆడపిల్లలు మగపిల్లలకు తలకు నూనె పెట్టి హారతి ఇవ్వటం, వాళ్లకు మగపిల్లలు ఎంతో కొంత డబ్బు బహుమతిగా ఇవ్వటం,

తలంట్లు, తరువాత పూరీలు, పాయసం చేసుకుని తినటం – ఎక్కడో మరుగున పడిన జ్ఞాపకాలను తిరిగి గుర్తు చేసుకున్నారు అందరూ.

స్నానాలు కాగానే అయోధ్య రామారావు గారు కొన్న కొత్తబట్టలు కట్టుకున్నారు అందరూ. సాయంత్రం కాగానే చిన్న పిల్లల్లాగా దీపావళి మందుగుండు సామాను కాల్చారు.

రాత్రి భోజనాలయ్యాయి. అందరినీ హాల్లో సమావేశ పరిచారు అయోధ్య రామారావు గారు. ఆ మర్నాడే అందరిదీ తిరుగు ప్రయాణం. ఒక్కసారిగా అందరి ముఖాల్లో చెప్పరాని దిగులు, బాధ. గడచిన మూడు రోజులు, అందరూ వాళ్ళ వాళ్ళ సంసారాల్ని పిల్లల్ను పూర్తిగా మర్చిపోయి అందమైన బాల్యాన్ని తిరిగి గుర్తు తెచ్చుకున్నారు. ఆ అనుభవం అప్పుడే అయిపోయిందన్న చింత అందరి ముఖాల్లో కనిపిస్తున్నది.

అందరికీ తెలుసు ఆ సమావేశం ఎందుకో!

ఆయన ఏమి మొదలుపెట్టక ముందే పట్టాభి రామ్ గొంతు విప్పాడు. "నాన్న గారూ! పావన్ అడిగినట్లు చేయండి. వాడికి అక్కడ చాలా ఇబ్బందిగా ఉందనుకుంటాను. నా తిప్పలు ఏవో నేను పడతాను" అన్నాడు చిన్నగా.

"లేదు, లేదు! అలా వద్దు నాన్న గారూ! అన్నయ్యకు ఇబ్బంది కలిగించే పని నేను చేయదలచుకోలేదు. నేను ఏదో మ్యానేజ్ చేసుకుంటాను" అడ్డు చెప్పాడు పావన్ రామ్.

ఆ వెంటనే నోరు విప్పింది మైథిలి. "అమ్మా! నేను కూడా ఒక విషయం చెప్పదలచుకున్నాను. నేను చెప్పేదానికి అన్నయ్య, తమ్ముడూ – ఇద్దరూ కూడ ఒప్పుకుంటారనుకుంటాను. నీవు నీ బంగారం అంతా జాహ్నవికి ఇచ్చెయ్యి. పాపం, అది అందరిలోకీ చిన్నది. పైగా ఇద్దరు ఆడపిల్లలు. దానికి అవసరం కూడా."

"లేదక్కా!" మైథిలి మీద చేయి వేసి అంది జాహ్నవి. "నాకంత స్వార్థం లేదు. ఎవరి అదృష్టం వారిది. ఇటువంటి వాటి వల్ల మనలో మనకు భేదాభిప్రాయాలు రావటం తప్ప ఇంకేమీ ఒరగదు" గద్గద కంఠంతో అన్నది జాహ్నవి.

నలుగురు పిల్లల వైపు ఆశ్చర్యంగా, ఆనందంగా చూశారు జానకమ్మగారు.

మెల్లగా నవ్వారు అయోధ్యరామారావుగారు. "ఎవరికైనా బాల్యం అన్నది ఒక అద్భుతమైన వరం. మీరందరూ చిన్నప్పుడు కలసిమెలసి పెరిగారు. ఎన్నో సుఖాలు మరెన్నో కష్టాలు కలిసి పంచుకున్నారు. ఎన్నో అనుభవాలు, ఎన్నెన్నో జ్ఞాపకాలు – చిన్నప్పటివి మీకు ఉన్నాయి. పెళ్లిళ్లు అయ్యి మీ మీ సంసారాలు మీకు ఏర్పడగానే ఆ బంధాలు, అనుబంధాలు మరుగున పడ్డాయి. అవి గుర్తుకు తెప్పిద్దామనే, మిమ్మల్ని ఒంటరిగా రమ్మన్నాను. మళ్ళీ మీరు మీ కుటుంబాలతో వస్తే ఈ పాత అనుబంధాలు గుర్తు రావడానికి మీకు ఏర్పడ్డ కొత్త బంధాలు ప్రతిబంధకాలు అవుతాయి.

మీరు చిన్నప్పుడు పెరిగిన వాతావరణంలో మళ్లీ మీరు కలవగానే మీకు మీ పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఆ ప్రేమలు, ఆప్యాయతలు మళ్ళీ అనుభవించారు.

"ఇప్పుడు మీరు మా చిన్నప్పటి పిల్లలు అయ్యారు. మాకు మీరంతా సమానమే. అయితే మీరు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే మీ మీ అభిరుచులు, అలవాట్లు, మీ స్వభావాలు, మీ అవసరాలు, మీ పరిస్థితులు – అన్నీ తెలిసిన నేను, మీ అమ్మ ఇక్కడ ఉన్నాము. మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత మా ఇద్దరిదీ. మేము ఎప్పుడు ఎట్లా చేయాలో, అప్పుడు అట్లా చేస్తాము. కానీ మీ మధ్య యీ అనురాగాలు, ఆప్యాయతలు ఎప్పటికీ ఇట్లానే ఉండేలా చూసుకునే బాధ్యత మాత్రం మీదే! అనవసరపు మనస్పర్థలు పెట్టుకుని ఒకరికొకరు దూరం కాకండి. రక్త సంబంధాలు గట్టిగా ఉండటానికి కారణం ఇటువంటి జ్ఞాపకాలే! ఎప్పుడు మీలో మీకు సమస్య వచ్చినా అవి గుర్తుకు తెచ్చుకోండి. ఈ జ్ఞాపకాలు మిమ్మల్ని స్వార్థ పరత్వానికి, సంకుచితత్వానికి దూరంగా ఉంచుతాయి.

"నిజానికి ఈ మారిన కాలమాన పరిస్థితుల్లో, మనుషులు రోజు రోజుకూ ఒంటరిగా అవుతున్న సమయంలో ఆడ, మగ – ప్రతి వారు ఇటువంటి వాతావరణం తిరిగి సృష్టించుకుని తమ బాల్యాన్ని తిరిగి అనుభవిస్తే అందరికీ  అందమైన అనుభవాలు మిగులుతాయి. చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.". ఒప్పుకుంటున్న ట్లుగా తలలూపారు పిల్లలు నలు

"మొత్తానికి, నా ప్రయత్నం సఫలం అయినందుకు నాకు చాలా గర్వంగా ఉంది. మిమ్మల్ని చూస్తుంటే  చాలా సంతోషంగాఉంది. అయితే దీనికి ఐడియా ఇచ్చింది మాత్రం మీ అమ్మే సుమా!" చిరునవ్వుతో అన్నారు అయోధ్య రామారావు గారు.

సంతోషంతో వెలిగిపోతున్న ముఖాలతో తనచుట్టూ చేరిన నలుగురు పిల్లల్ని దగ్గరకి తీసుకుంటూ, నీళ్ళు నిండిన కళ్ళతో సంతృప్తిగా భర్త వైపు చూశారు జానకమ్మ గారు.

COMMENTS